కథ

# దేవుడి బండి

భార్గవీరావు

**తె**లంగాణా ప్రాంతంలో మరో మారుమూలెలో ఒక పల్లె.

అనావృష్టి, రాజకీయాలు, నకిలీ విత్తనాలు- మరికొన్ని అనివార్య కారణాలవల్ల ఆత్మహత్య చేసుకున్న అనేక కుటుంబాల్లో ఒకదానికి చెందినవాడు, చిరంజీవి.

ఐదుగురు ఆడపిల్లల తరువాత అపురూపంగా పుట్టిన కొడుక్కి తన అభిమాన హీరో చిరంజీవి పేరు పెట్టుకుని పెంచింది తల్లి యాదమ్మ.

వంశోద్ధారకుడనీ, పెద్ద చదువులు చదివి ఉద్యోగం చేసి, ఊళ్ళేలి తన కష్టాల్నీ అప్పుల్నీ తీరుస్తాడని కలలు కన్నాడు తండ్రి మల్లేశం. వాళ్ళ కలలు చిరంజీవితోపాటే పన్నెండేళ్ళు పెరిగి అక్కడే ఆగిపోయాయి.

కష్టాలు తీరే మార్గం కనుచూపుమేరలో తీరే ఆశ కనిపించక, కల్తీ లేని పురుగుల మందు తాగి, ఆ కుటుంబమంతా ఆత్మహత్య చేసుకుంది. అలా ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు ప్రభుత్వం లక్ష రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇస్తుందన్న విషయం తెలిసిన మల్లేశం- ఆ డబ్బుతో తను బాకీ ఉన్న కట్నం డబ్బులు వియ్యాలవారికిచ్చి పెద్దకూతుర్ని కాపురానికి పంపాలనీ, మిగిలిన డబ్బుతో చిరంజీవి పట్నంలో ఏదైనా చిన్న వ్యాపారం చేసి బ్రతుకుతెరువు చూసుకోవాలనీ, వ్యవసాయం మట్టుకు ఎట్టి పరిస్థితుల్లోనూ చేయకూడదనీ తన తల్లికి పరోక్షంగా చెప్పి కన్నుమూసాడు.


ఏడ్చి, గుండెలు బాదుకుని ఓదార్చుకుని అంత్యక్రియలు ముగించారు. కానీ ఆ పల్లెలో ఎవరూ ఈ సామూహిక కుటుంబ ఆత్మహత్యల గురించి సంతాపం ప్రకటించలేదు. ఎందుకంటే అలాటివి మూడు కుటుంబాల్లో జరిగాయి. మల్లేశం వాళ్ళది నాలుగోది. ఓ యాభై గుడిసెలున్న ఆ పల్లెలో ఒక విధమైన నిర్వేదం, నిస్సహాయత, దిగులు ఆవరించి దుఃఖాన్ని కమ్మేసింది.

అందరికంటే ముందుగా తేరుకున్నది మల్లేశం తల్లి, లచ్చమ్మ. కోడలూ నలుగురు ఆడపిల్లల శవాలు నట్టింట్లో పడివున్న దృశ్యం కడుపులో పొడుస్తున్నా, బతికున్న మనుమరాలు చంద్రమ్మకూ, చిరంజీవికీ కళ్ళు తుడిచి, ధైర్యం చెప్పి ఇంత వండిపెట్టింది.

"లే పోరిగా, ఏడిస్తే ఏమొస్తది! మన అదురుట్టం ఇంతేనని సరి పెట్టుకోవాలె. గత పదిరోజులుగా మల్లేశం ఏదో అంటుంటే అరతం కాలా. ఇంత పని చేస్తాడనుకోలేదు! కోడలూ పిల్లల్నీ వదిలేసినా వాళ్ళ బతుకులు, తిప్పలూ వాళ్ళకుండేవి. వాళ్ళ నోట్లో మట్టిగొట్టడానికి వీడె వడూ ఎదవ సచ్చినోడు" అని చచ్చిన కొడుకుని శాపనార్థాలు పెట్టింది.

"ఎల్లు, పట్నం ఎల్లి పెబుత్వం ఏదో పైసలిస్తదంటగద, అది తెచ్చుకో, ఆనక ఏం చెయ్యాలో ఆలోసిద్దాం" అని చిరంజీవి చేతుల్లో కొంచెం జమచేసీ, కొంచెం అప్పు చేసిన చిల్లర డబ్బుల్ని పెట్టి బస్సెక్కించింది. చిరంజీవికి అదే మొదటి బస్సు ప్రయాణం. నానమ్మ చెప్పిన జాగ్రత్తల్నీ, చద్దన్నాన్నీ మూటకట్టుకుని బస్సులో భయం భయంగా ఓ మూలనక్కి కూర్చున్నాడు. రకరకాల మనుషుల్నీ, వెనక్కి పరిగెడుతున్న చెట్లనూ చూస్తూ అలసటగా నిద్రపోయాడు.

పెద్ద కుదుపుతో బస్సు ఆగింది. అందరూ బిలబిలా దిగిపోతున్నారు. పట్నం వచ్చేసిందన్న కండెక్టరు అరుపుతో ఉలిక్కిపడి తన చేతి సంచి తీసుకుని కిందికి దిగాడు చిరంజీవి. చుట్టూ చూసాడు. అంతా బస్సులే! ఆ బస్సులెక్కుతూనో, దిగుతూనో జనం. అక్కడక్కడా ఏవో అమ్ముకుంటూ కొంతమంది, అడుక్కుంటూ కొంతమంది తిరుగుతున్నారు. తనకు రావలసిన 'పెభుత్వ సాయం' లక్ష రూపాయలు ఎవర్ని అడగాలో అర్థం కాలేదు. వాళ్ళ నాన్న పోయిన రోజు పంచాయితీకి వచ్చిన పోలీసాయన ఒక కాయితం ఇచ్చి, దాన్ని పెబుత్వానికి చూపించాలని చెప్పాడు. అది బట్టలమధ్య భద్రంగా ఉందో లేదో తడిమి చూసుకున్నాడు. ఓ మూల కూచుని నానమ్మ కట్టిచ్చిన రొట్టి, పచ్చడి తిన్నాడు. నల్లా దగ్గరకెళ్ళి నీళ్ళు తాగాలనుకున్నాడు. ఆశ్చర్యం! అక్కడ మంది ఎవ్వరూ లేరు. గబగబా వెళ్ళి తిప్పాడు. ఒక



చుక్క నీళ్ళు కూడా రాలేదు. పక్కనే గట్టిగా నవ్వు వినిపించింది. తన ఈడు కుర్రాడే.

"దాంట్లో ఈ జన్మలో నీళ్ళు రావు గానీ, ఈ నీళ్ళ పాకెట్టు కొనుక్కో. రూపాయకోటి!"

కళ్ళప్పగించి చూస్తున్న చిరంజీ విని చూసి మళ్ళీ- "పట్నానికి కొత్త లా వున్నావే! ఇక్కడ నీళ్ళూ, మట్టీ, ఇసకా అన్నీ కొనాల్సిందే- బాబూ, పేరేమిటీ?" అన్నాడు.


"చిరంజీవి".

ఆ మాటకి కుర్రాడు పగలబడి నవ్వాడు. పదే, పదే కళ్ళల్లో నీళ్ళొచ్చి పొలమారేదాకా నవ్వాడు.

"చిరంజీవా? నీ పేరు చిరంజీవా?! మొహం చూడు సినిమాలో చేరాలని వచ్చావా?

"లేదు. మా అమ్మా నాన్నా అందరూ చనిపోయారు. గవరమెంటు పైసలిస్తరంట. మా ఊరి పోలీసు చెప్పాడు. అందుకే వచ్చా!"

ఆ మాట విని ఆ అబ్బాయి టక్కున నవ్వు ఆపేసాడు. దగ్గరకొచ్చి ఒక పాకెట్టు విప్పి నీళ్ళందించాడు. చిరంజీవి నీళ్ళు తాగి నిమ్మళించుకున్నాక- "నా పేరు కోటి. నాకూ అమ్మా, నాన్నా లేరు. గాలికొట్టుకొచ్చి, ఇక్కడ పట్నంలోనే పెరిగాను. అడుక్కునీ, అన్ని రకాల పనులూ చేసి రాటుదేలిపోయాను. నీ దగ్గరున్న ఆ చిత్తుకాయితాలు పట్టుకుని, ఎవ్వరి దగ్గరా డబ్బు రాబట్టలేవు. ముందు బతుకుతెరువు చూసుకో. మా బస్తీలో బాబాయికి అన్నీ తెలుసు. నీ కొచ్చిన డబ్బులో వాటా ఇస్తానంటే సాయం చేస్తాడు" అని చెప్పాడు. ఆ మాత్రం మాట సాయానికే గొప్పగా పొంగిపోయాడు చిరంజీవి.



** ** **

చిరంజీవి పట్నం వచ్చి నెలరోజులైంది. బస్తీలోనే ఓ మూల చేరిపోయాడు. చిత్తుకాగితాలూ, ప్లాస్టిక్ సంచులూ ఏరాడు. షాపులముందు ఊడవటం, చిన్న చిన్న బరువులెత్తటం లాటి పనులు చేసాడు. సైకిళ్ళు రిపేరు సాయిబు దగ్గర సామానులందించటం, 'పంచేరు' వేయటం నేర్చుకున్నాడు. వాళ్ళిచ్చిన రూపాయో, రెండో పట్టుకుని, ఏదో తిని కడుపు నింపుకుని అలసిపోయి నిద్ర పోయేవాడు. కలల్లో తనకు రావలసిన 'లచ్చా' వచ్చేసినట్టు, బాబాయికందులో ఇరవై వేలిచ్చి మిగిలిన డబ్బుతో తమ ఊరెళ్ళిపోయి నానమ్మను చూసినట్టూ, ఆమె సంతోషించినట్టూ కలలొచ్చేవి. మళ్ళీ తెల్లారాక మామూలే.

ఒకరోజు ఒళ్ళంతా పులిసిపోయి జ్వరం వచ్చినట్టుగా అనిపించింది. పనికి వెళ్ళలేక కప్పు చాయ్ తాగి, కోటిని వెదుక్కుంటూ బయలుదేరాడు. కోటి ఒక రెడీమేడ్ బట్టల దుకాణం దగ్గర కోతిలా వేషం వేసుకుని ఆ బజార్న వెళ్ళే వాళ్ళందర్నీ ఆకర్షిస్తూ తమ షాపుకి రమ్మని పిలుస్తున్నాడు. రోజుకి యాభై రూపాయలిస్తారట! తనకూ అలాటి అదృష్టం పడుతుందా? నానమ్మ ఎలా వుందో? కొన్ని పైసలన్నా కలిస్తే ఒకసారి ఊరెళ్ళి రావాలి. అమ్మా, నాన్నా, అక్కయ్యలూ లేని ఆ కొంపలో నానమ్మ ఒక్కతే ఎలా వుంటుందో అనుకుంటూ నడుస్తుంటే....

ఉన్నట్టుండి చుట్టూ జనం కమ్ముకొచ్చారు. ఏదో పాట, గుడిగంటల చప్పుడుతో ఓ ఎద్దుబండి. అందరూ ఒకే రంగుబట్టలు కట్టుకుని ఏవో పాటలు పాడేస్తున్నారు. గందరగోళంగా ఉంది. మళ్ళీ పరికించి చూసాడు. ఆ ఒంటెద్దు బండిమీద ఒక పెద్ద మనిషి ఫొటో వుంది. పసుపు, కుంకం, పూలు, అగరొత్తులు అన్నీ గుడిలోలాగే ఉంది. ఆ బండిని అక్కడక్కడే ఆపి, ఏదో ప్రసాదం విభూతి లాటిది పంచుతున్నారు. కొంతమంది వీళ్ళకు డబ్బులిస్తున్నారు కూడా.

ఒకమ్మాయి వచ్చి చిరంజీవి చేతిలో ఓ కొబ్బెరముక్క పెట్టింది. "కళ్ళకద్దుకుని తిను. పెసాదం" అంది.

"ఎవరిది?"

"బాబాది, సాయిబాబాది".

"సాయిబాబా ఎవరు?"

"అదిగో, ఆ బండిమీద పెద్ద ఫుటో లేదూ, ఆయనే!"

చిరంజీవి అర్థం కానట్టుగా, అయోమయంగా చూసాడు. "ఆయన దేవుడు. ఇప్పుడ్లేడులే. గుడి వుంది సిర్డీలో ఎక్కడో. ఆయనకి సాలామంది బక్తులు. నడు, మాతో నడు తెలుత్తది," అని చేయి పట్టుకున్న అమ్మాయి చనిపోయిన తన సీతక్కలా అనిపించి కళ్ళలో నీళ్ళు తిరిగాయి చిరంజీవికి.

జొరం తగ్గేవరకూ పని మానేసి వాళ్ళతో తిరిగాడు, చిరంజీవి, ఓ రెండ్రోజులు. అతడికి సాయిబాబా గురించి సరిగ్గా అర్థం కాలేదు కానీ ఆ దేవుడి బండి వ్యాపారం గురించి బాగా అర్థమైంది. ఒక బండిని తయారు చేసుకుని, ఓ పదిమంది కలిసి వీధి వీధీ తిరిగి, ధర్మం అడుక్కుంటారని! ఇదేదో వ్యవహారం బావుందనిపించి బస్తీలో బాబాయిని అడిగాడు.

"ఏరా పట్నం నీళ్ళు ఒంటబట్టినట్టుందే. ఇదీ మంచిదేలే. ఊరికే అడుక్కుంటే, 'దుక్కలా వున్నావు, పనిచేసుకోరాదూ' అంటారు. ఇలా దేవుణ్ణి అడ్డం పెట్టుకుని అడుక్కుంటే ఓ రూపాయి పడేసి తమ పాపాలు కడుక్కుందామనుకుంటారు. సరే, ఆలోచిస్తాలే" అని ధైర్యం చెప్పాడు బాబాయ్.

** ** **

కాలం కలిసొచ్చి చిరంజీవికి ఒక దేవుడి బండి దొరికింది. ఎవరో అమ్మేసి వెళ్ళిపోతుంటే బాబాయే బేరమాడి, డబ్బిచ్చి కొనిపెట్టాడు. ఆ బండిలో టేప్‌రికార్డరు కూడా వుంది.

"ఇదుగో, ఈ దేవుడి దయతో నీవు డబ్బు సంపాదించుకుని నా బాకీ తీర్చెయ్యాలి తెలుసా?" అన్నాడు బాబాయి.

దేవుడి బండిని కళ్ళారా చూసుకుని, మనసారా దండం పెట్టుకున్నాడు చిరంజీవి. కానీ ఈ దేవుడి బొమ్మ వేరుగా వుంది. సాయిబాబా కాదు. కావిరంగు ధోవతి, మెళ్ళో పూసలు. చేతిలో ఒక కర్ర, ముందు చెంబులాటిది వుంది. చొక్కాలేదు. ఏదో గుడ్డ కప్పుకున్నాడు. నుదుటి

ఉన్నట్టుండి చుట్టూ జనం కమ్ముకొచ్చారు. ఏదో పాట, గుడిగంటల చప్పుడుతో ఓ ఎద్దుబండి. అందరూ ఒకే రంగుబట్టలు కట్టుకుని ఏవో పాటలు పాడేస్తున్నారు. గందరగోళంగా ఉంది. మళ్ళీ పరికించి చూసాడు. ఆ ఒంటెద్దు బండిమీద ఒక పెద్ద మనిషి ఫొటో వుంది. పసుపు, కుంకం, పూలు, అగరొత్తులు అన్నీ గుడిలోలాగే ఉంది. ఆ బండిని అక్కడక్కడే ఆపి, ఏదో ప్రసాదం విభూతి లాటిది పంచుతున్నారు. కొంతమంది వీళ్ళకు డబ్బులిస్తున్నారు కూడా.

మీద నల్లగా నామం, కింద బొట్టు ఉన్నాయి. కళ్ళు దయతో మెరుస్తున్నాయి. పెదవులమీద నవ్వు... చిరంజీవి ఇంకా ఆలోచిస్తుండగానే ఎవరో ఒకతను వచ్చి 'మంత్రాలయవాస గోవిందా, గోవిందా!' అని గట్టిగా అరచి ఓ రూపాయి బిళ్ళ ఫొటో దగ్గర పెట్టి వెళ్ళాడు.

బండికి కట్టిన ఆ ఎద్దును ప్రేమగా నిమిరి, వక్కవీధికి వెళ్ళి టేప్ రికార్డరు నొక్కాడు. 'రాఘవేంద్రా, గుణసాంద్రా' అని పాట మొదలైంది.



ఆ దేవుడిపేరు రాఘవేంద్రుడని అర్థమైంది చిరంజీవికి. "కామధేనూ, కల్పవృక్షం వెదుక్కుంటూ మన వీధికే వచ్చింది, అదీ గురువారం రోజు' అనుకుంటూ మరికొందరు రూపాయీ, అర్ధా దానం చేసారు.

ఆ బండిమీద దేవుడు రాఘవేంద్రస్వామి అనీ, అతని గుడి తుంగభద్ర నదీ తీరంలో మంత్రాలయంలో ఉందనీ, అక్కడ చాలా మంది కన్నడం మాట్లాడేవాళ్ళు వస్తారనీ మెల్లమెల్లగా అర్థం చేసుకున్నాడు. సాయిబాబాలాగే ఈ దేవుడికీ బోల్డుమంది భక్తులున్నారనీ!

** ** **

రాఘవేంద్ర స్వామి బండికి అనతికాలంలోనే ఎంతో అదృష్టం పట్టింది. చిరంజీవితో మరో పదిమంది భక్తులు కలిసి వీధీ వీధీ తిరిగి, భక్తుల దగ్గరకెళ్ళి దానం స్వీకరించి వారికి "మంత్రాక్షతలు" ఇచ్చేవారు. అన్నదానం చేస్తామనీ, మంత్రాలయం వెళ్తామనీ, రాఘవేంద్రస్వామి ఆరాధనా మహోత్సవాలనీ- నానా రకాల కారణాలు చెప్పి డబ్బులడుక్కునేవారు. ఆ రాఘవేంద్రస్వామి మహత్యమో, చిరంజీవి అదృష్టమో కానీ దేవుడి బండి సంపాదన బాగా కలిసొచ్చింది.

చిరంజీవి కన్నడం నేర్చుకున్నాడు. భక్తిగీతాలు పాడటం నేర్చుకున్నాడు. కావిరంగు పంచెకట్టి, చొక్కాలేని ఒంటిమీద గోపీచందనంతో నామాలు పెట్టుకుని, జంధ్యవేసుకుని అరమోడ్చిన కళ్ళతో నడుస్తుంటే అచ్చం భక్తుడిలాగే కనిపించేవాడు. చేతిలో ఒకసారి చిరతలు, మరోసారి తాళాలు పట్టుకుని పాడుతుంటే భక్తులు కానివారు కూడా ఆగి వినేవారు. అలా దేవుడి బండి వ్యాపారం నిర్విరామంగా ఓ రెండేళ్ళు సాగింది.

మరో ఏడాదిలో చిరంజీవి చిట్టాలో రెండు వేల రూపాయలు మిగిలాయి. అంతా ఆ స్వామి మహిమేనని కళ్ళనీళ్ళతో నమ్మకంగా అనుకున్నాడు. ఎలాగైనా మంత్రాలయం వెళ్ళి వారి బృందావన దర్శనం చేసుకోవాలని తీర్మానించుకున్నాడు. తనతో బయలుదేరిన నారాయణ, రమేష్, మూర్తి- అందరి ఖర్చులూ తానే భరించి 'యాత్ర' చేయాలని అన్ని ఏర్పాట్లూ చేసుకున్నాడు.

** ** **

ఆ రెండేళ్ళలో చిరంజీవి నిజ్జంగా రాఘవేంద్రస్వామి భక్తుడైపోయాడు. వారి గురించి కూలంకషంగా తెలుసుకున్నాడు. స్వామివారు ఎప్పుడు పుట్టిందీ, వారి తల్లితండ్రుల పేర్లూ వారి మహత్యాలు అనర్గళంగా చెప్పేవాడు. మధ్యనొకసారి ఊరెళ్ళి నానమ్మను చూసొచ్చాడు. దేవుడిబండి గురించి చెప్పి, కొన్ని డబ్బులిచ్చాడు.

"నానమ్మా, వారి బృందావనం మంత్రాలయంలో ఉంది. నేను వెళ్తే నిన్నూ తీసుకెళ్తాను. ఆదోని బస్‌లో వెళ్తే బాగా దగ్గర. అక్కడ తుంగభద్రలో స్నానం చేస్తే పాపాలన్నీ పోతాయిట" అని చెప్పి వచ్చాడు.

చిరంజీవి బృందంలో మరికొంతమంది చేరారు. తనకొచ్చిన డబ్బుల్ని అందరితో పంచుకుని, ప్రసాదం పెట్టి వారి బాగోగుల్ని చూసుకునేవాడు. నారాయణ తల్లి వైద్యానికి డబ్బిచ్చాడు. రమేశ్‌కు కొడుకు పుడితే పురిటి ఖర్చులిచ్చి, ఆ కొడుక్కి రాఘవేంద్ర అని నామకరణం చేసాడు. సాయిబాబా బండినుండి తమ దగ్గర కొచ్చేసిన లలితకూ, తమ భక్తబృందంలోని యువకుడు గోపాల్‌కిచ్చి సంప్రదాయంగా పెళ్ళి చేయించాడు.

చిరంజీవి తెచ్చే దేవుడిబండికి మంచి ఆద రణ దొరికింది. ఆ బండి తమ వీధిలోకి వచ్చి నరోజు మంచి శకునమని జనం అనుకునేవారు, ముఖ్యంగా గురువారం. కష్టపడి గుడి కెళ్ళి గుంపులో తోపులాటల్లేకుండా ఆ యతివరేణ్యులే మన దగ్గరకొస్తున్నారన్న భావన బలపడింది కొంతమందిలో.

** ** **

మరో ఏడాదిలో చిరంజీవి చిట్టాలో రెండు వేల రూపాయలు మిగిలాయి. అంతా ఆ స్వామి మహిమేనని కళ్ళనీళ్ళతో నమ్మకంగా అనుకున్నాడు. ఎలాగైనా మంత్రాలయం వెళ్ళి వారి బృందావన దర్శనం చేసుకోవాలని తీర్మానించుకున్నాడు. తనతో బయలుదేరిన నారాయణ, రమేష్, మూర్తి- అందరి ఖర్చులూ తానే భరించి 'యాత్ర' చేయాలని అన్ని ఏర్పాట్లూ చేసుకున్నాడు. బండిని మిగిలిన భక్తులకు అప్పచెప్పి టాటాసుమోకారును అద్దెకు మాట్లాడుకుని మంత్రాలయ యాత్రకు ఒక శుభ ముహూర్తాన బయలుదేరారు.

** ** **

"హైదరాబాద్ నుండి మంత్రాలయ యాత్రకు బయలుదేరిన టాటాసుమో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొని, రాయచూరువద్ద ఘోర ప్రమాదానికి లోనయింది. కారులో ప్రయాణిస్తున్న వారందరూ అక్కడికక్కడే మరణించారు. అందులో హైదరాబాదుకు చెందిన దేవుడిబండి చిరంజీవి కూడా ఉన్నారు. అందరి మన్ననకూ పాత్రుడై తనకొచ్చినదాంట్లోనే నలుగురికీ సహాయపడి మంచివాడనిపించుకున్న చిరంజీవి అకాలమరణం కాలనీవాసులందర్నీ కంటతడిపెట్టించింది. ప్రమాదంలో మరణించినవారికి ప్రభుత్వం లక్ష రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది".

వార్త, ఏప్రియల్ 1, 2005

** ** **

మరో నెలలోనే దేవుడిబండి భక్తులు చెల్లాచెదరైపోయారు. బండి చేతులు మారింది. బండిమీద మరో మహాత్ముడి పటం వెలిసింది. చిరంజీవి మీద బెంగతోనో, వయస్సు మీద పడటం వల్లనో బండిని లాగే ఎద్దు కూడా చనిపోయింది. ప్రమాదంలో మరణించినవాళ్ళూ, దానధర్మాలు చేసినవాళ్ళ ఆత్మలు ఏమయ్యాయో గానీ ఆ బండిని లాగిన ఎద్దుకు మాత్రం మోక్షం ప్రాప్తించింది.

పాఠక విక్రమార్కుల్లారా! ఇలా ఎందుకు జరిగింది. రాఘవేంద్ర భక్తుడిగా మారి నిజ్జంగా నమ్మకంతో మంత్రాలయ యాత్రకు బయలుదేరిన చిరంజీవి ఆక్సిడెంట్‌లో ఎందుకు మరణించాడు? దానధర్మాలు చేసి, చిరంజీవి ఆశయంలో పాలు పంచుకున్నవారు పుణ్యాత్ములు కారా? ఎద్దుకే ఎందుకు మోక్షం వచ్చింది?

ప్రభుత్వం ప్రకటించిన ఎక్స్‌గ్రేషియా ఎవరికి, ఎప్పుడు వస్తుంది?

మీరు జవాబు చెప్పలేకపోతే మీ తల వేయి ముక్కలవదు. ఎందుకంటే జవాబు నాకూ తెలియదు కాబట్టి!